

## ఓటర్ల చైతన్యమే స్వీప్ లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఓటర్లను చైతన్యపర్చడమే స్వీప్ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆర్‌డిఒలు, ఇఆర్‌ఒలు, వివిధ పరిశ్రమల, కళాశాలల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో స్వీప్ నిర్వహణపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కళాశాల, పరిశ్రమలో స్వీప్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒలు బి.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత్‌అంబరీష్, చెన్నయ్య, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ కానాల సంగీత్ మాథుర్, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి, విష్ణు, డిఎన్‌ఆర్, ఎస్‌ఆర్‌కెఆర్ కళాశాలల, వివిధ పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధులు, పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ

- అంగన్వాడీల నిరసన భగ్నానికి పోలీసుల యత్నం
- ఎక్కడికక్కడ అంగన్వాడీలు, సిఐటియు నేతల అరెస్టులు
- సచివాలయ పోలీసులతో బెదిరింపులు
- నిర్బంధాన్ని దాటుకుని ప్రకాశంచౌక్‌లో బైఠాయించిన అంగన్వాడీలు
- గన్‌తో కాల్చేస్తామంటూ పోలీసుల వివాదస్పద వ్యాఖ్యలు
- ఉద్రిక్తతల నడుమ సాగిన అంగన్వాడీల 23వ రోజు సమ్మె

**గృహ నిర్బంధాలు.. అక్రమ అరెస్టులు.. రోడ్డుపై బైఠాయింపు.. నినాదాలు.. నిరసనలు.. అంగన్వాడీలు పట్ల పోలీసుల దాష్టీకంతో భీమవరం రణరంగంగా మారింది. అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వం, పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపినప్పటికీ అంగన్వాడీలు వేలాదిగా తరలొచ్చి నినాదాలు, నిరసన ప్రదర్శనతో తమ పోరాట పటిమ చాటారు. జిల్లావ్యాప్తంగా సుమారు 25 మంది సిఐటియు నేతలను తొలుత గృహనిర్బంధం చేసి, ఆపై అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. సుమారు 600 మంది అంగన్వాడీలకు ముందస్తు నోటీసులు జారీ చేసి మహిళా పోలీసులతో బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన అంగన్వాడీలు రాస్తారోకో చేసి నినదించారు. దీంతో పోలీసులు సిఐటియు నేతలను రోడ్డుపై ఈడ్చుకుంటూ లాక్కెళ్లి అరెస్టులు చేశారు. పోలీసు స్టేషన్ వద్ద అంగన్వాడీలను గన్‌తో కాల్చేస్తామంటూ పోలీసులు బెదిరింపులకు దిగడం వివాదస్పదమైంది. నిర్బంధాలన్ని అధిగమించి అంగన్వాడీలు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించారు.**



ప్రదర్శనగా తరలివెళ్తున్న అంగన్వాడీలు



ప్రకాశం చౌక్‌లో బైఠాయించిన అంగన్వాడీలు

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మెలో భాగంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శనను అడ్డుకునేందుకు పోలీసులు విఫలయత్నం చేశారు. జిల్లావ్యాప్తంగా 600 మంది అంగన్వాడీలకు ముందస్తు నోటీసులు జారీ చేసి నిరసన ప్రదర్శనకు వెళ్లకూడదని సచివాలయ పోలీసులతో బెదిరించారు. బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి 25 మంది సిఐటియు నేతలను గృహనిర్బంధం చేసి, ఆపై అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, నాయకులు డి.కళ్యాణి, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, గొర్ల రామకృష్ణ, తవిటినాయుడు, జవ్వాది శ్రీను, సుధాకర్‌తోపాటు మరికొంత మంది నేతలను అక్రమ అరెస్టులు చేశారు. నిరసన ప్రదర్శనకు వస్తున్న అంగన్వాడీలను అడ్డుకునేందుకు భీమవరంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, టౌన్ రైల్వేస్టేషన్, ప్రకాశం చౌక్ వంటి ప్రధాన ప్రాంతాల్లో పోలీసులను భారీగా మొహరించారు. భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్ నేతృత్వంలో ఆకివీడు సిఐ శ్రీనివాస్, రూరల్ సిఐ జి.శ్రీనివాస్, టూటౌన్ సిఐ జి.శ్రీనివాస్‌తోపాటు మరి కొంతమంది ఎస్‌ఐలు, ప్రత్యేక పోలీసు బలగాలను రంగంలోకి దింపి అడుగడుగునా ఆంక్షలు విధించి అంగన్వాడీలను అడ్డుకున్నారు. వారి దగ్గర ఉన్న సెల్‌ఫోన్లు తీసుకుని, బ్యాగులు తనిఖీ చేసి ఆపై అసభ్యకర పదజాలంతో దూషణపర్వం సాగించారు. అరెస్టు చేసిన అంగన్వాడీలను భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నిర్బంధించారు. ఆయా ప్రాంతాల్లో నలుపు చీరలు ధరించిన అంగన్వాడీలు నేలపై బైఠాయించి ప్రభుత్వం, పోలీసుల తీరును నిరసిస్తూ నినదించారు.

### ప్రకాశంచౌక్‌లో ఉద్రిక్తత

సిఐటియు నేతలను, అంగన్వాడీ నేతలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో అంగన్వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకాశంచౌక్‌కు వచ్చే అన్ని రహదారుల నుంచి అంగన్వాడీలు ఒక్కసారిగా చేరుకుని సెంటర్‌లో బైఠాయించారు. అప్పటికే రూపాంతర దేవాలయం వద్ద నుంచి కొంతమంది అంగన్వాడీలు, పాత బస్టాండ్‌లో ఉన్న సిఐటియు నేతలు, అంగన్వాడీలు భారీ ప్రదర్శనగా ప్రకాశం చౌక్‌కు చేరుకున్నారు. దీంతో పోలీసులు జీపును అడ్డం పెట్టి ప్రదర్శను అడ్డుకున్నారు. ఇక్కడ పోలీసులకు, సిఐటియు నేతల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వేలాదిమంది అంగన్వాడీలు ఒక్కసారిగా ముందుకు కదలడంతో పోలీసులు అనుమతించి మళ్లీ అడ్డుకున్నారు. జిల్లాలో 30 యాక్ట్ అమల్లో ఉందని, మీకు అనుమతి ఎవరిచ్చారంటూ భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్రమంలో సిఐటియు నేతలు బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, తెలగంశెట్టి సత్యనారాయణను పోలీసులు రోడ్డుపై ఈడ్చుకుంటూ లాక్కెళ్లి అరెస్టు చేశారు. దీంతో అంగన్వాడీలు మరింత ఆగ్రహంతో అక్కడికక్కడే రాస్తారోకో చేపట్టడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. రెండు గంటలపాటు అంగన్వాడీలు భీష్మించుకుని కూర్చోవడంతో ఆకివీడు సిఐ శ్రీనివాస్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్‌తో చర్చలు జరిపారు. అరెస్టు చేసిన నేతలను, అంగన్వాడీలను విడుదల చేయాలని, లేకపోతే కదిలే ప్రసక్తి లేదని నేతలు తేల్చి చెప్పడంతో పోలీసులు వారందరినీ విడిచిపెట్టారు. అనంతరం అంగన్వాడీలు సమరోత్సాహంతో ప్రకాశం చౌక్ నుంచి తహశీల్దార్ కార్యాలయం రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు చేరుకుని అక్కడ బైఠాయించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఐదో తేదీలోపు విధులకు హాజరు కావాలని కలెక్టర్ హెచ్చరికలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. మంత్రులు, ఎంఎల్ఎలు అంగన్వాడీలకు ఇచ్చే నెల జీతంతో ఒక నెల బతికితే ఇబ్బందులు తెలుస్తాయని విమర్శించారు.



వాసును లాక్కెళ్తున్న ఖాకీలు



సత్యనారాయణను ఈడుకెళ్తున్న పోలీసులు



అరెస్టు చేసిన అంగన్వాడీలను స్టేషన్‌కు తరలించిన పోలీసులు

### అబద్దాల దగా కోరు ప్రభుత్వం
### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

వైసిపి ప్రభుత్వం అబద్ధాల దగాకోరు ప్రభుత్వమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ విమర్శించారు. సభలో మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి అంగన్వాడీ సమస్యలు సిఎంకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. తెలంగాణ కంటే జీతం ఎక్కువ ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఒకపక్క ప్రభుత్వం అబద్ధపు మాటలతో, మరోపక్క మరోపక్క అధికారులు భయోత్పాతం సృష్టించడం సరికాదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలను పెంచాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### వీరోచిత పోరాటం అభినందనీయం
### సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ వలె అంగన్వాడీలు సాగిస్తున్న వీరోచిత పోరాటం అభినందనీయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ మొక్కవోని దీక్షతో సమ్మెను కొనసాగించాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీల ఆందోళనకు యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.అజయకుమారి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ప్రసాద్, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు, ఐద్వా జిల్లా నాయకులు సరోజిని సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.త్రిమూర్తులు, ఎస్.రంగారావు, పివి.ప్రతాప్, ఎస్.వెంకటేశ్వరరావు, మండా సూరిబాబు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎమ్‌డి.హసీనా, ఉషారాణి, కె.తులసి, దీన, విజయలక్ష్మి, చైతన్య, పెద్దింట్లు, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

### గన్‌తో కాల్చేస్తాం..

పాత బస్టాండ్‌లో అరెస్టు చేసిన అంగన్వాడీల పట్ల భీమవరం టూటౌన్ పోలీసులు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నలుపు చీరలు ధరించిన అంగన్వాడీలంతా పోలీస్ స్టేషన్ ఆవరణలో బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలుపుతున్న క్రమంలో అక్కడున్న పోలీసులు దురుసుగా వ్యవహరించారు. 'ఎక్కువ చేస్తే చూస్తూ ఊరుకోమని.. పైనుంచి ఆదేశాలు వస్తే గన్‌తో కాల్చి చంపేస్తాం' అంటూ బెదిరించడం వివాదాస్పదమైంది. దీంతో అక్కడే ఉన్న సిఐటియు నేత ఎ.అజయకుమారి, అంగన్వాడీలు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అంగన్వాడీలకు ధైర్యం చెప్పి మద్దతు తెలిపారు. అంగన్వాడీల పట్ల పోలీస్ తీరు దారుణమని ఖండించారు.



నిరసన సభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

# బకాయిలు చెల్లిస్తారా.. గద్దె దింపమంటారా..!



ధర్నా ముగింపు సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, పక్కనే గోపీమూర్తి

**ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు అల్టిమేటం**

**యుటిఎఫ్ ఆధ్వర్యంలో 12 గంటల ధర్నా విజయవంతం**

**అమలు కాని హామీలు నమ్మొద్దు**

**యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్**

ప్రజాశక్తి - భీమవరం

'ఒకటో తేదీనే జీతం.. మెరుగైన పిఆర్‌సి.. సకాలంలో డిఎలు ఇవ్వడంతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయులతో స్నేహపూరిత వాతావరణంలో ఉంటానని చెప్పిన జగన్ అధికారం చేపట్టిన తర్వాత ఇవన్నీ మరచి ప్రవర్తించడం సిగ్గుచేటని ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలు విమర్శించారు. సమస్యలు పరిష్కరించడంతోపాటు బకాయిలు విడుదల చేస్తారా.. గద్దె దింపమంటారా అని అల్టిమేటం జారీ చేశారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం ఎదురుగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో 12 గంటల ధర్నా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించగా రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు దాచుకున్న వేల కోట్ల రూపాయలు దోచుకోవడం దారుణమన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే విజయవాడలో ఈ నెల 9, 10 తేదీల్లో 36 గంటల ధర్నాకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఐక్య పోరాటంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఆ విధంగా అంతా ముందుకు సాగాలని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ సమస్యలు ఐక్య పోరాటాలే శరణ్యమన్నారు. ధర్నాలో యుటిఎఫ్ నేతలు దండు పద్మావతి, సరిపల్లి జయప్రభ, ఎం.మార్కండేయులు, కె.శ్రీదేవి, కె.రాజశేఖర్, సిహెచ్.పట్టాభిరామయ్య, పి.శివప్రసాద్, జి.లక్ష్మీనారాయణ, పి.క్రాంతికుమార్, డి.ఏసుబాబు, జి.రామకృష్ణంరాజు, కె.శ్రీరామకృష్ణ, ప్రసాద్, కెఎసిహెచ్.సాయిరాం, ఎం.శ్రీనుబాబు, పి.కృష్ణకుమారి, జివివి.రామానుజరావు, ఎంవి.రాజశేఖర్, కెవి.సత్యనారాయణమూర్తి, పులఖండం శ్రీనివాస్ పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ప్రసాద్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వలీ, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ చైతన్య ప్రసాద్, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగ నాయకులు బావాజీ, సురేష్, రోహిణి సంఘీభావం తెలిపి మాట్లాడారు.



వంటావార్పు

### వంటావార్పుతో వినూత్న నిరసన

**ధర్నా శిబిరం వద్ద వంటావార్పు చేపట్టి వినూత్నరీతిలో నిరసన తెలిపారు. అనంతరం రోడ్డుపైనే సహపంక్తి భోజనాలు చేశారు.**

### పట్టణంలో భారీ ర్యాలీ

స్థానిక యుటిఎఫ్ కార్యాలయం నుంచి ఉపాధ్యాయులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం చౌక్ మీదుగా పోలీస్ బొమ్మ సెంటర్, మావుళ్లమ్మ గుడి రోడ్డు, ఆంధ్రాబ్యాంక్ రోడ్డు, తహశీల్దార్ కార్యాలయం రోడ్డు మీదుగా యుటిఎఫ్ కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటంతోపాటు ఇటీవల మృతి చెందిన ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయుడు, యుటిఎఫ్ నేత పెన్మెత్స సత్యనారాయణరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### అమలు కాని హామీలు నమ్మొద్దు
### యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు ఇచ్చే అమలు చేయని హామీలు నమ్మొద్దని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. యుటిఎఫ్ 12 గంటల ధర్నా ముగింపు సందర్భంగా ఆయన విచ్చేసి మాట్లాడారు. ఈ ధర్నాలో ఆర్థిక శాఖాధికారులు బకాయిల లెక్కలు కడుతున్నారన్నారు. అయితే ఐక్య ఉద్యమాలు మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో చంద్రబాబు ఉపాధ్యాయులను మోసం చేశారని, ఆపై అధికారం చేపట్టిన జగన్ అమలు చేయని హామీలిచ్చి మరోసారి మోసం చేశారని అన్నారు. రాబోయే రోజుల్లో వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

## ఆర్థిక భరోసాగా సామాజిక పెన్షన్లు
### కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

సామాజిక పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక కింద పెంచిన రూ.3 వేలు అందించే కార్యక్రమాన్ని బుధవారం కాకినాడలో సిఎం జగన్ ప్రారంభించగా, జిల్లాస్థాయి కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుండి కలెక్టర్ పి.ప్రశాంతి, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గుబ్బల తమ్మయ్య, ఎంబిసి కార్పొరేషన్ ఛైర్మన్ పెండ్ర వీరన్న, పెన్షన్ లబ్ధిదారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లాల్లో నేటి వరకు అర్హులైన 25 రకాల పింఛన్‌దారులు 2,38,321 మందికి రూ.69.97 కోట్లు అందజేస్తున్నామన్నారు. అనంతరం పింఛన్‌దారుల అవగాహన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. లబ్ధిదారులకు నమూనా చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శివప్రసాద్‌యాదవ్, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి కెసిహెచ్.అప్పారావు, పెన్షనర్లు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

# కాలయాపన చేస్తే మూల్యం చెల్లించక తప్పదు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా చర్చల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సిఐటియు హెచ్చరించింది. బుధవారం మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు ఎస్‌కె. నాగూరు, జి.నాని మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి దిగిరాని పక్షంలో అత్యవసర సేవలు నిలిపివేస్తామని హెచ్చరించారు వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జెఎసి నాయకులు బంగారు వరలక్ష్మి, నిమ్మకాయలు ధనలక్ష్మి, బంగారు కామాక్షి, ఎన్.విశ్వనాథం, నేలాపు అప్పన్న, కె.నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

### కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

**తణుకు రూరల్ :** మున్సిపల్ కార్మికుల సమ్మె 9వ రోజుకు చేరింది. ఈ మేరకు కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పేరుకు చర్చలు అంటూ ప్రభుత్వం కార్మిక నాయకులను పిలిచి సమస్యలు పరిష్కారం చేయకుండా తిప్పుతోందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీలపు ఆదినారాయణ బాబు, వై.అయ్యప్ప, ఎం.నాగేంద్రబాబు, మజ్జి కృష్ణబాబు పాల్గొన్నారు




తణుకులో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

## జగనన్న హయాంలో ఉచిత విద్య, వైద్యం
### డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం అందిస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. తాడేపల్లిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వీకర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్లో ఒకటి, రెండు వార్డులకు ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల బాగోగుల గురించి వైసిపి ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తుందనడానికి జగనన్న ఆరోగ్య సురక్ష నిదర్శనమన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రులకు చేర్చి వారి ప్రాణాలు కాపాడేందుకు 108 అంబులెన్స్‌లను ప్రవేశ పెట్టారన్నారు. అనంతరం కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా రూ.25 లక్షలకు పెంచిన వైఎసఆర్ ఆరోగ్యశ్రీ కొత్త హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ సభ నిర్వాహకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శామ్యూల్, ఆర్‌డిఒ కె.చెన్నయ్య, పార్టీ పట్టణ అధ్యక్షులు గుండుబోగుల నాగు, జెసిఎస్ పట్టణ కన్వీనర్లు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.



గుణదలలో బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

# మెగా డిఎస్‌సిని విడుదల చేయాలి

## విజయవాడలో మంత్రి బొత్స కాంపు కార్యాలయం ముట్టడి

**ప్రజాశక్తి - ఆచంట**

25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సిని తక్షణం విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ అన్నారు. బుధవారం మెగా డిఎస్సి విడుదల చేయాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా నాయకులు విజయవాడ తరలివెళ్లారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయాన్ని డివైఎఫ్ఐ నాయకులు ముట్టడించి ధర్నా చేపట్టారు. అనంతరం వారిని పోలీసులు అరెస్టు చేసి విజయవాడ మధురానగర్, మాచవరం, గుణదల పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, ఉపాధ్యక్షులు బర్ల బాలాజీ, నాయకులు జి.ప్రసన్న, మీసాల శ్రీను, ఎ.ప్రసాద్, ఎం.వెంకటరాజు, నెల్లి రాజేష్, ఎస్‌కె.సుభాని ఉన్నారు.

# విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు అందజేత

**ప్రజాశక్తి - పాలకొల్లు**

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎవిఎస్ఎన్ఎం మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న 80 మంది విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లను మద్దాల వాసు ఆర్థిక సాయంతో బుధవారం అందజేశారు. అలాగే రోటరీ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్ ఆర్థిక సాయంతో పరీక్షలు రాసేందుకు అట్టలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, ట్రెజరర్ ఎం.ప్రదీప్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇమ్మిడి రాజేష్, స్కూల్ హెచ్ఎం ఆర్.విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు ఆర్.దీపిక పాల్గొన్నారు.

# విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

**ప్రజాశక్తి - ఆచంట**

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాణ్యమైన విద్యనందిస్తున్నారని వైసిపి మండల అధ్యక్షులు, సర్పంచి జక్కంశెట్టి చంటి అన్నారు. బుధవారం ఆచంట వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చంటి మాట్లాడారు. మండలంలో సుమారు 484 మందికి ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచి కొండేటి సురేష్ బాబు, విద్యా కమిటీ ఛైర్మన్ ఎడ్ల రామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు చల్లా వీరభద్రం, పంచాయతీ కార్యదర్శి పి.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

# త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

స్థానిక త్యాగరాజ భవనం వద్ద త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి 105వ ఆరాధనోత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. సన్నాయి మేళాలతో, సంగీత కచేరీలతో శోభాయాత్ర పట్టణ ప్రధాన వీధుల్లో సాగింది. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కారుమూరి ఆదిత్య మాట్లాడుతూ 104 ఏళ్లుగా దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా విధ్వాంసులతో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కార్మూరి ప్రకాష్, కార్మూరి సత్యనారాయణ మూర్తి, కారుమూరి చినబాబు, గంధం విశ్వేశ్వరరావు, వి.శ్రీవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# యాక్టు నిలుపుదలపై న్యాయవాదుల హర్షం

**ప్రజాశక్తి - తణుకు రూరల్**

భూమి హక్కుల యాజమాన్య చట్టం అమలును నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంపై తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం న్యాయవాదులు కోర్టు ఆర్డర్‌కు హర్షం వ్యక్తం చేస్తూ తణుకులో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ నెల రోజుల నుండి రాష్ట్ర ప్రభుత్వం చేసిన చీకటి చట్టం యాక్ట్ 27ను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు విధులు బహిష్కరించి వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేశారని తెలిపారు. ఈ చట్టాన్ని పూర్తిగా రద్దు చేసే వరకూ న్యాయవాదులు ఉద్యమాన్ని చేశారని తెలిపారు. కార్యక్రమంలో తణుక బార్ అసోసియేషన్ కార్యదర్శి కెవివి.సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులు చింతపల్లి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి దాసు, అనుకూల రమేష్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి పాల్గొన్నారు.

# 5న ఆహ్వాన సంఘ సమావేశం

**ప్రజాశక్తి - తణుకు రూరల్**

ఎపి కల్లుగీత కార్మిక సంఘం 15వ రాష్ట్ర మహాసభలు తణుకులో నిర్వహించేందుకు ఈ నెల 5వ తేదీన ఆహ్వాన కమిటీ సమావేశం తణుకులోని అమరవీరుల భవనంలో నిర్వహిస్తున్నట్లు కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి తెలిపారు. బుధవారం తణుకులో ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకులో ఆహ్వాన కమిటీ నిర్వాహణ గురించి చర్చించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకత్వం ఈ సమావేశానికి హాజరై సమావేశంలో ప్రభుత్వం గీత కార్మిక వృత్తికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మహాసభ ద్వారా కర్తవ్యాలను రూపొందించేందుకు ఆహ్వాన కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు నరసింహమూర్తి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి, ఉపాధ్యక్షులు గుబ్బల వీర రాఘవులు, జిల్లా సహాయ కార్యదర్శి కడలి పాండు పాల్గొన్నారు.

# టిడిపితోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి

## ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

**ప్రజాశక్తి - ఉండి**

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. బుధవారం టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో పాల్గొన్న మంతెన రామరాజు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో బడుగు బలహీన వర్గాలకు రాయితీ లోన్లు ఇచ్చేవారని, నేడు ఆ పరిస్థితి లేదని, బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీలకు ఇచ్చే రాయితీ లోన్లు నిర్వీర్యం చేశారని విమర్శించారు. వాటిని పునరుద్ధరించేలా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు, ఎం.కృష్ణంరాజు, మంతెన సాయి లచ్చిరాజు పాల్గొన్నారు.

# బాలోత్సవంలో కోపల్లె విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - కాళ్ల**

బాలల మానసిక వికాసానికి, విద్యాభ్యాసంలో సృజనాత్మకత ద్వారా ఉన్నత శిఖరాలకు ఎదగడానికి బాలోత్సవం ఎంతో ఉపయోగపడిందని ప్రధానోపాధ్యాయిని కె.నిర్మలాదేవి అన్నారు. బుధవారం కోపల్లె హైస్కూల్లో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఇటీవల భీమవరంలో జరిగిన బాలోత్సవంలో కోపల్లె హైస్కూల్ విద్యార్థులు సీనియర్ విభాగంలో గ్రూప్ డాన్స్, వ్యాసరచన, కవితల్లో ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నారు. జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఇంజినీరింగ్ విభాగంలో మాంటిస్లిప్ అలారం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. విద్యార్థులు బహుమతులు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, కె.సత్యలక్ష్మిని అభినందించారు.



# ఐద్వా నేత వెంకాయమ్మ మృతి


వెంకాయమ్మ (ఫైల్‌ఫొటో)

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

ఐద్వా సీనియర్ నేత, సిపిఎం సానుభూతిపరురాలు పాలుపూరి వెంకాయమ్మ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున ఇటుకలగుంట గ్రామంలో మృతి చెందారు. ఆమె మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిపిఎం మండల నాయకులు కండెల్లి సోమరాజు, వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు మడక రాజు, మండల కమిటీ సభ్యులు పురిటిగడ్డ జయమ్మ, సిఐటియు నాయకులు కరెడ్ల రామకృష్ణ, గున్నబత్తుల నాగేశ్వరరావు, జవ్వాది శ్రీను, నర్మాల కృష్ణ, ఎం.వెంకటరమణ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెంకాయమ్మ సిపిఎం, మహిళా సంఘం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాల్లో పాల్గొనేవారన్నారు. ముఖ్యంగా బెల్టు షాపులకు వ్యతిరేకంగా మహిళలను కూడగట్టి మద్యం సీసాలను పగలగొట్టి గ్రామంలో బెల్ట్ షాపులు లేకుండా చేయించారన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు నాయకులు సానుభూతి తెలిపారు.

# సావిత్రిబాయి పూలేను స్ఫూర్తిగా తీసుకోవాలి

**ప్రజాశక్తి - కాళ్ల**

సావిత్రిబాయి పూలే కృషిని, ఆమె సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని మహిళా ఉపాధ్యాయినులు తమ ఉద్యోగ జీవితంలో మరింత ఉన్నత స్థానాలు పొందాలని ఎంఇఒ ఎ.రవీంద్ర అన్నారు. బుధవారం మండల విద్యావనరుల కార్యాలయంలో యుటిఎఫ్, ఎస్‌టియు, పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. సావిత్రిబాయి పూలే మహిళల హక్కుల కోసం పోరాడారన్నారు. మండల విద్యాశాఖ అధికారి-2 గాదిరాజు కనకరాజు మాట్లాడుతూ మండలంలో మూడు ఉపాధ్యాయ సంఘాలు కలిసి మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం తొమ్మిది మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీరామకృష్ణ, మురళీ, స్వామి, కృష్ణమూర్తి, సాయివర్మ, శంకర్రావు, కల్కి మూర్తి, గణేష్, ప్రసాద్, పాపారావు, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.


కాళ్ల : తొమ్మిది మంది మహిళా ఉపాధ్యాయిలను సత్కరిస్తున్న సభ్యులు

**భీమవరం రూరల్** : సావిత్రి బాయ్ పూలే ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని భీమవరం సిటీ మిషన్ మేనేజర్ సిహెచ్ నానిబాబు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా సిబ్బంది, ఆర్‌పిలకు అవగాహన కల్పించారు. అనంతరం నానిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో సిఒలు జయకృష్ణ, సంతోషమ్మ, పెద్దింట్లమ్మ, స్లమ్ సమాఖ్యల రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

**పోడూరు** : సావిత్రి బాయి పులే జయంతిని లవ్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుమ్మలూరు ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు గుమ్మలూరి లక్ష్మి భ్రమరాంబికను ఫౌండేషన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయిని పీటర్సన్ శాంత గ్రేస్, జనసేన నేతలు పాల్గొన్నారు.

**గణపవరం** : సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శమని స్థానిక డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. సావిత్రి బాయి పూలే జయంతిని కాలేజీలో ఘనంగా నిర్వహించారు. సభలో పాల్గొన్న నిర్మలాకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.అక్కిరాజు, జి.వెంకట్రావు, జి.వెంకటరమణ, కె.స్వరూపరాణి పాల్గొన్నారు.

**ఆచంట:** సావిత్రిబాయి పూలే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలని మండల విద్యాశాఖాధికారి-1 ఉషారాణి అన్నారు. కోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జ్యోత్సుల శ్రీనివాసరావు అధ్యక్షతన సావిత్రి బాయి పూలే సందర్భంగా ఎంఇఒ ఉషారాణి, ఉపాధ్యాయిని కె.సుబ్బలక్ష్మి, ఎంపిపి పాఠశాల హెచ్ఎం ఆశ్లేషను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఉషారాణి మాట్లాడారు. సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బాలికలు ఆమెను స్ఫూర్తిగా తీసుకుని, సమాజం పట్ల బాధ్యత గా నడవాలని హైస్కూల్ హెచ్ఎం జ్యోసుల శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగిడిపల్లి శ్రీనివాసరావు, మోరా ఉన్నవెంకట్రావు, మొల్లేటి కృష్ణాజీ, పట్టా క్రాంతివర్మ పాల్గొన్నారు.

**ఉండి** : కెవిపిఎస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పాందువ్వలో కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదాసి గోపి మాట్లాడారు. కార్యక్రమంలో దేవాబత్తుల దుర్గాప్రసాద్ కుమార్, ఇజ్రాయేల్, ఆటో యూనియన్ అధ్యక్షులు ఎం.దేవదాస్, ఎం.మనేంద్ర, వీధి రమణ, మహాదేవి పాల్గొన్నారు.

# నేతల అక్రమ అరెస్టును నిరసిస్తూ ఖండన

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

తాము శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే అరెస్టులు చేయడం ఏంటని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం తలపెట్టిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కలెక్టరేట్ల వద్ద బైఠాయింపు కార్యక్రమానికి వెళ్లకుండా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ధనాల వెంకటరావుకు మంగళవారం రాత్రి నోటీసులిచ్చి బుధవారం అరెస్టు చేసి పట్టణ పోలీసు స్టేషన్లో నిర్బంధించారు. దీంతో కార్యకర్తలు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి నాయకులను విడుదల చేయాలని నినాదాలు చేశారు. అనంతరం రూరల్ సిఐ మూర్తి మధ్యాహ్నం 12 గంటలకు నాయకులను, అంగన్‌వాడీ వర్కర్స్‌ను విడుదల చేశారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో నిరసన, ఆందోళన, ధర్నాలు, రాస్తారోకోలు చేసుకునే హక్కు చట్టంలో ఉందని, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరచి అరెస్టులు చేయడం దారుణమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బెదిరింపులకు భయపడం అన్నారు. ఈ నెల 5వ తేదీలోపు విధుల్లో చేరకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామంటూ కలెక్టర్లు జారీ చేసిన సర్క్యులర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గున్నాబత్తుల నాగేశ్వరరావు, జవ్వాది శ్రీను, సిఐటియు నేతలు పాల్గొన్నారు.

**పాలకొల్లు** : అంగన్‌వాడీలు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో వారిని అడ్డుకునేందుకు పాలకొల్లులో ముందస్తు అరెస్టులు చేశారు. పట్టణ సిపిఎం కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్‌ను అరెస్టు చేసి పాలకొల్లు పోలీసుస్టేషన్‌కు తరలించారు.

**ఆకివీడు** : అంగన్‌వాడీలను అరెస్టు చేయడం జగన్ రౌడీ రాజకీయానికి నిదర్శనమని సిపిఎం కార్యదర్శి కె.తవిటి నాయుడు విమర్శించారు. సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి, సిఐటియు పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు డోకల రవి, బి.రాంబాబు, బివి వర్మను పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. మంగళవారం రాత్రి కళ్యాణిని, తవిటి నాయుడు రాంబాబు, రవి, వర్మను బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు గృహ నిర్బంధం చేశారు.

**గృహ నిర్బంధాన్ని నిరసిస్తూ ఆందోళన..**

పోలీసులు, ప్రజాసంఘాల నాయకుల గృహ నిర్బంధాన్ని నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు బుధవారం సాయంత్రం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు ఎస్.ఉదయ్ కుమారి, డోకల లక్ష్మి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాల్సింది పోయి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు.

**వీరవాసరం** : తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం నిర్బంధం కొనసాగిస్తోంది. ఈ మేరకు బుధవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు నాగరత్నంను గృహనిర్బంధం చేశారు. అలాగే మరో అంగన్‌వాడీ నాయకురాలు నిర్మలను పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రజా సంఘాల నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, ఆంజనేయులు ఖండించారు.

**తణుకు రూరల్** : కలెక్టరేట్ వద్ద ఆందోళన నేపథ్యంలో నేతల ముందస్తు అరెస్టులను జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ ఖండించారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న వారిని అరెస్టులు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజలకు ఇష్టం వచ్చిన హామీలిచ్చి ఇప్పుడు పోలీసులు పక్కన దాక్కోవడం శోచనీయమన్నారు.

**పెంటపాడు** : భీమవరం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల సమస్యలు విన్నవించడానికి వెళ్తున్న నేతలు, కార్యకర్తలను నిర్బంధించడం సిపిఎం ఖండించింది. అర్ధరాత్రి ఒంటి గంటకు పెంటపాడు పోలీస్ స్టేషన్ నుంచి ఇద్దరు కానిస్టేబుల్స్ ఇళ్లకు వచ్చి సిరప రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, జె.శ్యామల కుమారి, ఆర్.అనూరాధ, వి.కనకలక్ష్మి, తదితరులకు నోటీసులు జారీ చేయడం సిగ్గుచేటన్నారు. నాయకులను నిర్బంధించినంత మాత్రాన ఉద్యమాలు ఆగవని అన్నారు. కార్యక్రమంలో చల్లా చంద్రరావు, గొర్లి శ్రీను, కరక వెంకట్రావు, దత్తి రాము, కొల్లి సాయి, మచ్చ వాసు పాల్గొన్నారు.

**ఐద్వా ఆధ్వర్యాన నిరసన**

**యలమంచిలి** : అంగన్‌వాడీలు చేపట్టిన ఉద్యమాన్ని అణచి వేయడానికి ప్రభుత్వం చేస్తున్న ధమనకాండకు వ్యతిరేకంగా ఐద్వా ఆధ్వర్యంలో చించినాడ జాతీయ రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు మాట తప్పను, మడమ తిప్పనని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి ప్రస్తుతం మాట తప్పడమే కాకుండా అంగన్‌వాడీలు చేస్తున్న ఉద్యమాన్ని ఉక్కు పాదంతో అణగదొక్కాలని చూడడం దుర్మార్గపు చర్య అని తెలిపారు. ఇప్పటికైనా అంగన్‌వాడీలకు న్యాయం చేయకపోతే ఐద్వా ఆధ్వర్యాన ప్రత్యక్ష పోరాటానికి పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి జిల్లెళ్ల ప్రశాంతి, ముస్కుడి జయశ్రీ, ఎస్.నాగమణి, బంగారమ్మ, పార్వతి, నాగమణి పాల్గొన్నారు.

**ఆచంట (పెనుమంట్ర):** ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని, సమస్యలు పరిష్కరించకుండా ప్రతీకార చర్యకు దిగడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసి మహిళలని చూడకుండా పోలీసులు నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పెనుమంట్ర మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్‌ప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, రైస్ మిల్లు కార్మికులు మాదాసు లక్ష్మణరావు, వి.భాస్కరరావు, కె.కృష్ణ, బి.రామకృష్ణ, ఎస్.చిరంజీవి, శ్రీనుబాబు, వినాయక్ పాల్గొన్నారు.

**మొగల్తూరు** : సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో భీమవరంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు మొగల్తూరు నుంచి అంగన్వాడీలు ప్రత్యేక వాహనాల్లో బుధవారం బయలుదేరి వెళ్లారు. అంగన్వాడీలు అధికారులు ఇచ్చిన నోటీసులకు బెదరకుండా అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. జి.పెద్దింట్లు, సీత, సారమ్మ, రేఖ, శాంభవి, నాగలక్ష్మి వెళ్లిన వారిలో ఉన్నారు.

**ఆచంట** : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆచంట, పెనుమంట్ర, పోడూరు, పెనుగొండ, మండలాల నుంచి అంగన్‌వాడీలు భారీ సంఖ్యలో భీమవరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని తెలిపారు.

# సంక్రాంతిలోపు రీసర్వే పూర్తి చేయాలి

## జాయింట్ కలెక్టర్ రామ సుందర్‌రెడ్డి

**ప్రజాశక్తి - భీమవరం**

పొరపాట్లకు తావు లేకుండా అర్బన్ రీసర్వేను సంక్రాంతిలోపు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. దేశంలోనే పైలెట్ ప్రాజెక్టు తాడేపల్లిగూడెం అర్బన్ రీసర్వే ఆదర్శంగా నిలవాలన్నారు. బుధవారం జెసి తన ఛాంబర్‌లో తాడేపల్లిగూడెం అర్బన్ రీసర్వేపై ఆర్‌డిఒ కె.చెన్నయ్య, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ దేశంలోనే పైలెట్ ప్రాజెక్టు కింద తాడేపల్లిగూడెం అర్బన్ రీసర్వే ఆదర్శంగా నిలవాలన్నారు. 18 నెలల క్రితం ప్రారంభించిన పట్టణ రీసర్వే సంక్రాంతి నాటికి పూర్తి చేయాలన్నారు. పట్టణ మ్యాపును పరిశీలించి, వార్డుల వారీగా జెసి సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువా, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎ.శామ్యూల్, తహశీల్దార్ ఎస్.శివశంకర్, సహాయ సిటీప్లానర్ జి.సీతారామ్, మండల సర్వేయర్ ఆర్.రామకృష్ణ, ఐటి టీమ్స్, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గణతంత్ర వేడుకలకు పవన్‌సాయి విఘ్నేష్

**ప్రజాశక్తి - భీమవరం**

ఈ నెల 26వ తేదీన దేశ రాజధాని న్యూ ఢిల్లీలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగనున్న జాతీయ గణతంత్ర దినోత్సవ వేడుకలకు డిఎన్‌ఆర్ కళాశాల సీనియర్ డివిజన్ తృతీయ ఏడాది క్యాడెట్ ఎం.పవన్ సాయి విఘ్నేష్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ బిఎస్.శాంతకుమారి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణ రాజు మాట్లాడారు. దేశం యావత్తూ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు కళాశాల క్యాడెట్ ఎంపికవ్వడం కళాశాలకు, అతని తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణమన్నారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఇతర దేశ పెద్దల సమక్షంలో వేడుకల్లో పాల్గొని, కళాశాల ప్రతిష్టను పెంచనున్నాడని తెలిపారు. భవిష్యత్తులో అత్యుత్తమ స్థానానికి చేరుకోవాలని తెలిపారు. కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు జి.పాండు రంగరాజు, ప్రిన్సిపల్ బిఎస్.శాంత కుమారి, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎ.వీరయ్య మాట్లాడారు. ఎంపికైన క్యాడెట్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు, ఉపాధ్యక్షులు జి.పాండు రంగరాజు, సంయుక్త కార్యదర్శి కె.రామకృష్ణంరాజు, సహాయ కార్యదర్శి కె.శివరామ రాజు, పాలకవర్గ సభ్యులు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ జె.సోమరాజు, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎ.వీరయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ : ఎంపిపి

**ప్రజాశక్తి - పాలకోడేరు**

ఎన్నికల ముందు పింఛను రూ.3 వేలు చేస్తానని చెప్పి అమలు చేసి ప్రతిపక్షాల నోళ్లకు తాళాలు వేశారని ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంటిరాజు లబ్ధిదారులకు పింఛన్లు అందజేసి మాట్లాడారు. మండలంలో కొత్తగా 202 పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. మండలంలో మొత్తం పింఛన్ల సంఖ్య 9,478కు చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కాకర్లమూడి నాగేంద్ర కుమార్, సర్పంచుల సంఘం మండల కార్యదర్శి బొల్లా శ్రీనివాస్, వైస్ ఎంపిపి ఆదాడ లక్ష్మీ తులసి, ఎంపిటిసిలు ఆరేపల్లి పెద వెంకటస్వామి, పాలా జ్యోతి, బొల్లం గాంధీ, షేక్ పాపా సాహెబ్, సర్పంచులు ఇంజేటి మరియమ్మ, చింతపల్లి వెంకటనారాయణ, కడలి నాగేశ్వరి, చిల్లా అనూష, నాయకులు పాల్గొన్నారు.

**మొగల్తూరు:** మొగల్తూరులో పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పెరిగిన పింఛన్లు, కొత్త పింఛన్లను ఈ నెల 4వ తేదీ గురువారం చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అందజేయనున్నారని ఎంపిడిఒ ఉండ్రు బాబ్జి రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు రావాలని సూచించారు.

# కొనసాగిన ఎస్ఎస్‌ఎ ఉద్యోగుల సమ్మె

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆ ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్షులు షేక్ బావాజీ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సమ్మె శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ గత 15 రోజుల నుండి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులు కళ్లకు గుడ్డ కట్టుకుని, మెడకు ఉరితాడు బిగించుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంతోషి, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సత్యనారాయణకు పితాని పరామర్శ

**పోడూరు:** గుమ్మలూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు కడలి సత్యనారాయణ ఇటీవల గుండెకు సంబంధించిన చికిత్స చేయించుకున్నారు. ఆయనను మాజీ మంత్రి పితాని సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్య నారాయణరాజు, ఆర్.సుబ్రహ్మణ్యం రాజు, దొంగ సూర్యప్రసాద్, బొక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# సిద్ధాంతంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ పర్యటన

**ప్రజాశక్తి - పెనుగొండ**

సిద్ధాంతం గ్రామంలో సీతమ్మ కాలనీ, చింతలపాలెం కాలనీ, అరుంధతిపేటలో రహదారులు, డ్రెయినేజీలను ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం పరిశీలించారు. అనంతరం రామన్నపాలెం గ్రామంలోని ఎస్‌సి కాలనీలో పర్యటించి త్వరలోనే ఎస్‌సి కమ్యూనిటీ హాల్‌నూ నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి యర్రశెట్టి బుజ్జి, ఎంపిటిసి ఏడుకొండలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులు నాగేశ్వరరావు

**ఆచంట (పెనుమంట్ర):** రేషన్ డీలర్స్ మండల కార్యదర్శి సోడగిరి నాగేశ్వరరావు మంచి ఉద్యమ, కళాకారులని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. బుధవారం సోడగిరి నాగేశ్వరరావు ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన ఉద్యమ బాటలో అంతా నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నమట్ల మునిబాబు, తాడిపర్తి సంపత్‌రావు, జయపాల్, నాగేశ్వరరావు, మానవత శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆదర్శనీయురాలు కాళికాంబ

**ప్రజాశక్తి - నరసాపురం టౌన్**

నేటి యువతరానికి మాజీ ఎంఎల్‌ఎ పరకాల కాళికాంబ ఆదర్శనీయురాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పరకాల కాళికాంబ సంతాప సభలో కాళికాంబ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీతివంతమైన రాజకీయాలకు పరకాల కాళికాంబ శేషావతారం దంపతులు చిరునామా అన్నారు. మాజీ మంత్రి శేషావతారం నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కేంద్ర పాలక మండలి సభ్యులు పిడి.రాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కామన నాగిని, ఎఎంసి ఛైర్మన్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

# 'టిడిపితోనే సమస్యల పరిష్కారం'

**మొగల్తూరు:** ప్రజా సమస్యల పరిష్కారం టిడిపితోనే సాధ్యమని టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు డోల్లా రత్నంరాజు అన్నారు. బుధవారం నక్కవారిపాలెంలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పార్టీ సిద్ధాంతాలను వివరిస్తూ కరపత్రాలను ప్రజలు అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ అలీషా, నక్కా పెద్దిరాజు, పాల పరుశురాముడు, బత్తుల లాల్‌రావు పాల్గొన్నారు.

# దళితులపై పెరుగుతున్న దాడులు

**ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్**

దళిత మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని టిడిపి, జనసేన ఎస్‌సి నాయకులు తెలిపారు. పాలకొల్లు మండలం చందపర్రు గ్రామం చోడేపాడు, దాసరి వారి చెరువుగట్టు, యలమంచిలి మండలం ఇలపకుర్రు గ్రామాల్లో నేతలు ప్రచారం నిర్వహించారు. దళితులను వైసిపి ప్రభుత్వం దగా చేసిందన్నారు. చందపర్రు గ్రామ చోడేపాడు, దాసరి వారి చెరువుగట్టులో జరిగిన కార్యక్రమంలో నాయకులు తాళ్ల నాగరాజు, పితాని పుష్పరాజు, దేవళ్ల రాజారత్నం, తదితర నేతలు పాల్గొన్నారు.